క్లుప్తంగా

శ్రీకాంత్‌కు ఉత్తమ సూపర్‌వైజర్‌గా అవార్డు



దామెర : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ ఉత్తమ హెల్త్ సూపర్‌వైజర్‌గా అవార్డు అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీకాంత్‌కు డీఎంహెచ్‌ఓ సాంబశివరావు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీకాంత్‌ను మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మంజుల, ఉషారాణి, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, జీఎంహెచ్ ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీదేవి, అశోక్‌రెడ్డి, ప్రసాద్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్



పరకాల : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేడు (బుధవారం) ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్టు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ తెలిపారు. మండలంలోని వివిధ విద్యాసంస్థలను ఆయన ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కళ్యాణ్ మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఉద్యమిస్తున్నాయని చెప్పారు. బంద్ విజయవంతానికి సహకరించాలని విద్యార్థులను, ఉపాధ్యాయులను కోరారు.

గుండెపోటుతో కౌలు రైతు మృతి




సుధాకర్ (ఫైల్)

శాయంపేట : గుండెపోటుకు గురై కౌలు రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మైలారం గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన కౌలు రైతు నూనె సుధాకర్ (56) ద్విచక్ర వాహనంపై శాయంపేట నుంచి మైలారం వెళ్తుండగా గ్రామ శివారులోని మూలమలుపు వద్ద గుండెపోటుకు గురై బైక్ నుంచి కింద పడిపోయాడు. స్థానికులు అతన్ని వెంటనే పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా సుధాకర్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. సుధాకర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ అరకిల్ల ప్రసాద్, ఎంపీటీసీ గడిపె విజయ విజయ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మోతాదుకు మించి టాబ్లెట్లు మింగి వ్యక్తి మృతి

ధర్మసాగర్ (వేలేరు) : మతిస్థిమితం లేని వ్యక్తి మోతాదుకు మించి టాబ్లెట్లు మింగి మృతి చెందిన ఘటన మండలంలోని పీచర గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పీచరకు చెందిన జల్తార్ రజినీకాంత్ (24) మతిస్థిమితం లేక హనుమకొండలోని మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతను మంగళవారం ఉదయం తను వాడే ట్యాబ్లెట్లు ఒకేసారి 30 వేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



సదానందం (ఫైల్)

ఎల్కతుర్తి : మద్యం మత్తులో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్సై జక్కుల పరమేశ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన అయిత సదానందం (51) మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో స్థానిక బస్టాండ్ సమీపంలో సోమవారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దామెర : వినతిపత్రం ఇస్తున్న నాయకులు



కమలాపూర్‌లో..



పరకాలలో..



ఎల్కతుర్తి : సమ్మెలో నాయకులు, కార్మికులు



ఐనవోలులో..

కమలాపూర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొల్లెంపల్లి షద్రక్, పుల్ల వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెను మంగళవారం వారు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనేక ఏండ్లుగా గ్రామాల్లో అతి తక్కువ వేతనాలతో సేవలు అందిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్మికుల అన్ని సమస్యలనూ వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ మండల అధ్యక్షుడు ఈ.అయిలయ్య, ఉపాధ్యక్షుడు జి.రమేశ్, ప్రధాన కార్యదర్శి వి.రాజయ్య, సహాయ కార్యదర్శి ఎం.సారయ్య, నాయకులు ఎం.భాస్కర్, అరుణ, సారమ్మ, రమ, ఈశ్వరమ్మ, చంద్రకళ, పుల్ల రాజేశ్, పుల్ల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పరకాల : జీపీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ కార్మికుల (కారోబార్) సంఘం మండల ఉపాధ్యక్షుడు జగ్జీవన్ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్మిక సంఘం నాయకులు ఆనందరావు, కోరె సంతోష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దామెర : జీపీ కార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయగా జీపీ ఉద్యోగ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నల్ల చిరంజీవి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు బొబ్బిలి, ఉపాధ్యక్షుడు గోవిందు ఆనంద్, కోశాధికారులు దండ్రె దేవేందర్, యజ్ఞం సురేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో చేపట్టిన జీపీ కార్మికుల సమ్మెకు ఎమ్మార్పీఎస్ నాయకుడు సాతూరి వెంకన్న సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడెల్లి లక్ష్మణ్, మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, రవిందర్‌రావు, సునీల్, సాయిలు, థామస్, రమేశ్, కోటయ్య, కిష్టయ్య సాంబయ్య పాల్గొన్నారు.

ఐనవోలు : స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి జీపీ ఉద్యోగ, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బొక్కల నారాయణ, జిల్లా నాయకులు బరిగల వెంకటస్వామి సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జీపీ ఉద్యోగ, కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కొత్తూరు యేసోబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట యాకయ్య, నాయకులు కొండేటి రవి, సిబ్బంది మల్లేశం, చంద్రయ్య, సంజీవ, పెద్దులు, ఎల్లయ్య, రాజు, ఎలిశా, కొమురమ్మ, జయమ్మ, రూప పాల్గొన్నారు.

ఘనంగా 'పల్లా' జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లో రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మల్లికుదుర్ల గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి ర్యాలీ తీసి టపాసులు పేల్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీలు చాడ సరిత, పిట్టల శ్రీలత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాయిత మాధవరెడ్డి, వైస్ ఎంపీపీ అంగోతు సంపత్, నాయకులు గోదల రాజిరెడ్డి, బిల్లా యాదగిరి, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బొడ్డు ప్రభుదాస్, కొలిపాక రమేశ్, బొడ్డు సోమయ్య, చాడ వెంకట్‌రెడ్డి, గంకిడి దామోదర్‌రెడ్డి, చల్లా రమణాకర్‌రెడ్డి, మోరెపెల్లి సమ్మిరెడ్డి, చల్లా రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సంజయ్ పుట్టిన రోజు సంబురాలు



ఎల్కతుర్తిలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో, భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లోని అంధ విద్యార్థులకు, ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షులు కుడితాటి చిరంజీవి, పృథ్వీరాజ్, నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, జనగాని కిష్టయ్య, ముష్కె వెంకటేశ్, చిదురాల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్, దళిత మోర్చా మండల ప్రధాన కార్యదర్శి పుల్ల శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు కొలిపాక తిరుపతి, మంద అశోక్, రవికిరణ్, దుండ్ర రాజు, బాబురావు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీజేవైఎం మండల అధ్యక్షుడు లడే శివ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఉప్పు రాజు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, నాయకులు బాసాని విద్యాసాగర్, మంద సురేశ్, బాసాని నవీన్, మేకల సుమన్, చంద్రమౌళి, సాంబయ్య, శ్రీను, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడమే ధ్యేయం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

కమలాపూర్ : విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడమే ధ్యేయంగా ప్రభుత్వం, విద్యాశాఖ అనేక కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర పరిశీలకుడు, ఎస్‌ఆర్‌జీ సభ్యుడు కె.ఉపేందర్‌రావు తెలిపారు. మండలంలోని అంబాల ఎంపీపీఎస్, కమలాపూర్ ఎంపీపీఎస్ (ఎస్సీ) పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. పఠనోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తరగతి గదుల్లో విద్యార్థులతో కథల పుస్తకాలు, తెలుగు, ఇంగ్లీష్, గణితం పుస్తకాలు చదివించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకునేలా విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. అనంతరం ఆయన కమలాపూర్‌లోని ఎంజేపీ (గర్ల్స్) పాఠశాలను సందర్శించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్పీ పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, డీఆర్పీ శ్రీనివాస్, సీఆర్పీ సుభాశ్, ఎస్ఓ అర్చన పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుదర్శనం, అంజనీదేవి, తదితరులు

ఐనవోలు : మహబూబ్‌నగర్ జిల్లాలో అక్టోబర్‌లో నిర్వహించనున్న డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుదర్శనం, ఉపాధ్యక్షురాలు బి.అంజనిదేవి ఉపాధ్యాయులను, విద్యాభిమానులను కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొండపర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మహాసభల కరపత్రాలను వారు మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు, సామాజిక అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. విద్యారంగానికి తీరని నష్టం కలిగించేలా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి కామన్ స్కూల్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతనెల 30న గడువు ముగిసిన క్రమంలో రెండో పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని, కమిషన్ సిఫార్సులు వచ్చే వరకు మధ్యంతర భృతి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు ఆర్.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, కార్యదర్శి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఒరిగిన విద్యుత్ స్తంభం తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : 'పడితే ప్రమాదమే.. పట్టించుకునే వారేరి..?' శీర్షికతో మండలంలోని మైలారం గ్రామ శివారులో జోగంపల్లె దారిలో నెలకొన్న సమస్యపై నేడు ప్రచురితమైన 'సాక్షి' కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఆ శాఖ ఏడీఈ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మెన్ సంతోశ్, సిబ్బంది అరుణ్ మంగళవారం ఘటనా స్థలికి చేరుకుని చెట్టుకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. ఎలాంటి ప్రమాదమూ జరగక ముందే అధికారులు విద్యుత్ స్తంభాన్ని తొలగించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దళిత జర్నలిస్టుల ఫోరం మండల కమిటీ ఎన్నిక



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో సీనియర్ జర్నలిస్ట్ మాడుగుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దళిత జర్నలిస్టుల ఫోరం మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాట్ల హరికుమార్, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల సంతోశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బొల్లపల్లి చరణ్‌రాజ్, కోశాధికారిగా కనకం వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా మాడుగుల రామకృష్ణ, సిక భిక్షపతి, మేకల శ్యామ్, సుంచు విద్యాసాగర్, నల్లగొండ నాగరాజు, అల్లకొండ వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడారు. దళిత జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. దళిత బంధు పథకం, ఇంటి స్థలాలు, ఇతర సంక్షేమ పథకాల్లో దళిత జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత జర్నలిస్టుల సమస్యలపై పోరాడతామని చెప్పారు. హరికుమార్ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి : మండలంలోని చింతగట్టు గ్రామంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ మీడియాకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిట్స్ క్రాస్, ఎర్రగట్టుగుట్ట,, నారాయణనగర్, మంత్రపురి కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మతులు, లైన్ షిఫ్టింగ్, తదితర పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు శాఖ ఉద్యోగులకు, సిబ్బంది సహకరించాలని ప్రదీప్‌కుమార్ కోరారు.

బహుజన విద్యార్థి గర్జన కరపత్రం ఆవిష్కరణ

హన్మకొండ చౌరస్తా: ఈనెల 20వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించనున్న బహుజన విద్యార్థి గర్జన సభకు విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఎస్పీ వరంగల్ రీజియన్ సెక్రటరీ కన్నం సునీల్ పిలుపునిచ్చారు. ఈమేరకు సభ కరపత్రాలను నేరెళ్ల కళాప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ తెలంగాణ చీఫ్, సీఎం అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో సాగుతున్న ప్రజా ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ కన్వీనర్ అడ్లూరి పద్మ, బాధ్యులు బొల్లెపల్లి సారయ్య, శనిగరపు రాజు, మంద శ్యాం, వనం మహేందర్, మాదారపు రవికుమార్, జన్ను భరత్, చాతళ్ల వేణుగోపాల్, జన్ను అనిల్, బోసు మల్లేశ్వరి, దరిగి ధనరాజ్, కందుకూరి కిశోర్, వేల్పుల శంకర్, మామిండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్



సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే రమేశ్

ఐనవోలు : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే వర్ధన్నపేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి కమిటీలు గుర్తించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజల అవసరాల మేరకే అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని దిశానిర్దేశం చేశారు.

మండల అభివృద్ధికి రూ.173 కోట్లు

మండల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.173 కోట్లు ఖర్చు చేసినట్టు ఎమ్మెల్యే రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోయే రోజుల్లో అవసరమైతే సీఎం సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. అనంతరం 20 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, ఆలయ కమిటీ చైర్మన్ మజ్జిగ జయపాల్, మునిగాల సంపత్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, నాయకులు బుర్ర రాజశేఖర్, మిద్దెపాక రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మారెడ్డిపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న చింతం సదానందం

ఆత్మకూరు : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై తెలంగాణ ఉద్యమకారుల పేరుతో కొందరు ఆరోపణలు చేయడం సరికాదని ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు చింతం సదానందం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మారెడ్డి నిబద్ధతను చూసే ఆయనకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ 2018లో పరకాల ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యేగా ధర్మారెడ్డి ఎన్నికయ్యాక పరకాల నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఉద్యమకారులకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులు ఇచ్చారన్నారు. ధర్మారెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలని ఇటీవల కేటీఆర్ స్వయంగా పిలుపునిచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించిన ఘనత ఎమ్మెల్యే ధర్మారెడ్డికే దక్కుతుందని స్పష్టం చేశారు. పరకాల నియోజకవర్గంలో ధర్మారెడ్డిపై పోటీ చేసే సాహసం ప్రతిపక్షాలు లేదన్నారు. సమావేశంలో ఎంపీపీలు మార్క సుమలత రజనీకర్, కాగితాల శంకర్, జెడ్పీటీసీలు కక్కెర్ల రాధిక రాజు, గరిగె కల్పన కృష్ణమూర్తి, సొసైటీ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, వైస్ ఎంపీపీలు రేవూరి సుధాకర్‌రెడ్డి, జాకీర్ అలీ, సర్పంచ్‌లు అర్షం బలరాం, మచ్చిక యాదగిరి, రబియాబీ హుస్సేన్, ఎంపీటీసీలు అర్షం వరుణ్‌గాంధీ, మమత రవీందర్, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కానుగంటి సంపత్‌కుమార్, దామెర మండల అధ్యక్షుడు గండు రాము, ఏఎంసీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, నాయకులు పాపని రవీందర్, వంగాల భగవాన్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్లు సాగర్, విశ్వేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు కాకాని శ్రీధర్, షైడి, కోఆప్షన్ మెంబర్ అంకూస్, నాయకులు రేవూరి ప్రవీణ్‌రెడ్డి, దాడి రమేశ్, జన్ను సాంబయ్య పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా.. 'ప్రకృతి వనం'



పల్లె ప్రకృతి వనం ముందు కుప్పగా పోసిన చెత్త

శాయంపేట : మండలంలోని జోగంపల్లిలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం డంపింగ్ యార్డులా తయారైంది. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఎదుటే కొందరు చెత్తను కుప్పగా పోస్తున్నారు. ఈ క్రమంలో పల్లె ప్రకృతి వనం డంపింగ్ యార్డును తలపిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సర్పంచ్ తన సొంత బర్లను పల్లె ప్రకృతి వనంలోకి తోలి మేపించిన ఘటనలు తెలిసిందే. పల్లె ప్రకృతి వనం ఎదుట చెత్తను కుప్పగా పోసినా పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదు. ఇకనైనా అధికారులు పల్లె ప్రకృతి వనం ఎదుట ఉన్న చెత్త కుప్పలను తొలగించడంతోపాటు అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

● జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ మసీయొద్దీన్



శిక్షణ పొందిన మహిళలతో మసీయొద్దీన్

దామెర : మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కాజా మసీయొద్దీన్ తెలిపారు. మండలంలోని పులుకుర్తి గ్రామంలో మూడు నెలల పాటు నిర్వహించిన ఉచిత కుట్టు, బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమ ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా వృద్ధి సాధించాలని సూచించారు. తొలుత రికార్డులను మసీయొద్దీన్ పరిశీలించారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజు, సూర్జిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, సర్పంచ్ గోవిందు అశోక్, ముదిగొండ కృష్ణమూర్తి, రిసోర్స్‌పర్సన్లు దామెరుప్పుల సంధ్య, హింగె సువత తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులందరికీ పట్టాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక శివారులోని సర్వే నంబర్ 633లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు జీఓ నంబర్ 58 ప్రకారం పట్టాలిచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పరకాలలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న చేస్తున్న క్వారీలను మూసేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. పేదలకు పట్టాలివ్వకపోతే రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తోట భిక్షపతి, సదాలక్ష్మి, దుప్పటి సాంబయ్య, బత్తిని సదానందం, అనుకారి అశోక్, అరికిల్ల దేవయ్య, మారెపల్లి క్రాంతికుమార్ పాల్గొన్నారు.